సాక్షి
చిత్తూరు
శనివారం । 8 । మార్చి । 2025



మహిళా దినోత్సవం



మగువ ధీర

సృష్టికి మూలం స్త్రీ. ఆమె శక్తియుక్తులు అపారం. ఆమె ఓ ప్రేరణ...ఓ లాలన. ఆమె లేకుంటే ఈ సృష్టి లేనే లేదు. దానికి గమ్యం, గమనం లేదు. మనిషికి జీవం, జీవితమే లేదు. ఆమె లేకుంటే అంతా శూన్యం. అందుకే ఆమెకు శతకోటి వందనాలు. అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ మహిళలు చరిత్ర సృష్టిస్తున్నారు. అవకాశాలు లేకపోయినా, అవమానాలు ఎదురైనా....ఎవరో వచ్చి సాయం చేస్తారని ఎదురు చూడలేదు. ఆకాశమే హద్దు, అవకాశాల్లో సగం అంటూ ముందం జలో దూసుకుపోతున్న స్త్రీ మూర్తులెందరో. వంట గదికే ఆమెను అంకితం చేద్దామని చూస్తే అంతరిక్షంలో దూసుకెళ్లింది. వాకిలి దాటొద్దని ఆంక్షలు పెడితే ఆవలి హద్దులు దాటి అవనిని జయించింది. ఆమె ప్రస్తానం అంతా ఇంతా కాదు... ఏ రంగమైనా నేనే మేటి అని నిరూపించిన తెగువ, తెలివి ఆమెది. నేడు ఆమె పండుగ. అదే అంతర్జాతీయ మహిళా దినోత్సవం.



- వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- అవకాశాలే లేవన్న చోట ఆకాశంలో సగమై..
- శనివారం నాగయ్య కళాక్షేత్రంలో వేడుకలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం





చిత్తూరు కలెక్టరేట్ : మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఆటు పోట్లు ఎన్ని ఎదురైనా విజయమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. ప్రతిభ చాటుతూ పలువురి నుంచి ప్రశంసలు పొందుతున్నారు. జిల్లాలో అనేక మంది మహిళలు రాజకీయాల్లో ఉన్నత స్థానాల్లో రాణించారు. ఉన్నత ఉద్యోగాల్లో ముందుకు దూసుకుపోతున్నారు. వ్యాపార సామ్రాజ్యంలో జిల్లా మహిళల పాత్ర తక్కువేమి కాదు. ఓ వైపు కుటుంబం, మరోవైపు ఉద్యోగ, వ్యాపార బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా స్థాయి అధికారిక కార్యక్రమం నిర్వహించనున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని మహిళల అభిప్రాయాలు ఇలా..

ఆంక్షలు లేకుండా పెంచాలి



మహిళలకు ప్రోత్సాహం ముఖ్యం. అతివలను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారు. విద్యార్థి దశలో తల్లి, తండ్రి ప్రోత్సాహం మరువలేనిది. ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నానంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే. ప్రతి తల్లిదండ్రులు పిల్లలపై ఆంక్షలు పెట్టకుండా ప్రోత్సహించాలి. అప్పుడే విజయం వైపు దూసుకుపోతారు. తల్లిదండ్రులు ప్రోత్సాహం వల్లే తాను ఈ స్థాయికి చేరాను. ప్రతి మహిళా చదువే తన ఆస్తిగా భావించాలి. **చదివే** మనల్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లే ఆయుధం, భయం వీడి మహిళలు అన్నిరంగాల్లో రా**ణిం**చాలి.

– విద్యాధరి, జాయింట్ కలెక్టర్, చిత్తూరు

కుటుంబ సభ్యుల తోడ్పాటు



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే కుటుంబ సభ్యుల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలి. మగవారికి దీటుగా క్రీడలు, రాజకీయాలు, వ్యాపారాలు, ఉద్యోగాలతో పాటు అంతరిక్ష ప్రయోగాల్లోనూ నేడు మహిళల పాత్ర ఎంతగానో పెరుగుతోంది. ఇలాంటి ప్రయత్నాలు మహిళా లోకానికి గర్వకారణం. దీనంతటికీ ప్రధానంగా కుటుంబ సభ్యుల ప్రోత్సాహమే కారణం. తాను జిల్లా స్థాయి **అధికారి స్థా**నంలో ప్రస్తుతం రాణిస్తున్నానంటే కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే. తల్లిదండ్రులు, **భర్త,** సోదరుల ప్రోత్సాహం ఉంటే మహిళలు ఏ రంగంలోనైనా రాణిస్తారు.

– శ్రీదేవి, ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఆర్‌డీఏ





మహిళలు తమ శక్తిని చాటాలి



మహిళలు వంటింటికే పరిమితం కాకూడదు. చదువులో ముందుండి ఉన్నత ఉద్యోగాలు సాధించి తమ శక్తిని చాటుకోవాలి. తమకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని స్వశక్తితో ముందుకు సాగాలి. సమాజంలో మహిళల పాత్ర ఎంత గొప్పదనే విషయాన్ని ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా ఎదగాలి. ఒకప్పుడు నాలుగు గోడల మధ్య వంటింటి కుందేళ్లుగా మహిళలు ఉండేవారు. ఈ రోజు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. స్వశక్తితో అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. మహిళలు సమాజానికి దిక్సూచిగా నిలవాలి. ఆ దిశగా ప్రతిఒక్కరూ లక్ష్యం నిర్దేశించు కోవాలి.

– వరలక్ష్మి, డీఈవో, చిత్తూరు

దేశ సంస్కృతికి వారధిగా..



చిత్తూరులో నివాసముంటున్న **మీనా** కుమారి ప్రస్తుతం ఐరాల మండలం కాణిపాకం హైస్కూల్ ప్లస్‌లో జువాలజీ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె విద్యార్థి దశ నుంచి మొదటి స్థానంలో నిలవాలన్నదే లక్ష్యం. 1990లో ఎస్జీటీగా విధుల్లో చేరిన ఆమె అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం పీజీటీ స్థాయికి చేరుకున్నారు. చిన్నతనంలో అమ్మమ్మ, నాన్నమ్మల నుంచి నాణేల సేకరణపై ఆసక్తిని పెంచుకున్నారు. ఆ ఆసక్తిని ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. దేశ సంస్కృతి చరిత్ర తెలియజేసే వేలాది నాణేలను ఇప్పటి వరకు సేకరించారు. పలువురు రాజులు, బ్రిటీష్ పరిపాలన, విదేశాలకు చెందిన నాణేలు, డాలర్లు వేల సంఖ్యలో సేకరించారు. వాటితో పాఠశాలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి దేశ సంస్కృతి, సంప్రదాయాలు విద్యార్థులకు తెలియజేసేందుకు కృషి చేశారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్నారు. సేవా పరంగా తల్లిదండ్రులు గిరిజమ్మ, నానేగౌడ్ స్మారకార్థం ఏటా పేద విద్యార్థులకు సొంత నిధులతో స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నారు.

– విద్యార్థినులతో జువాలజీ లెక్చరర్ మీనాకుమారి

క్రీడాస్ఫూర్తితో ముందడుగు



ఒక వైపు ఉద్యోగం, మరోవైపు ఇంటి బాధ్యతలను చూసుకుంటూనే క్రీడా పతకాలు సాధిస్తున్నారు. ఆమె ప్రస్తుతం ట్రాన్స్‌కో ఏఈగా ఐరాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. తవణంపల్లె మండలానికి చెందిన ఆమె తండ్రి షణ్ముగం వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్దారు. తండ్రి ప్రోత్సాహంతోనే ఆమె సైతం క్రీడల్లో చురుగ్గా పాల్గొని రాణించింది. బీటెక్ పూర్తయ్యాక ట్రాన్స్‌కో ఉద్యోగం సాధించారు. ఉద్యోగంలో చేరాక ఉద్యోగులకు నిర్వహించే క్రీడా పోటీల్లో పాల్గొనడం ప్రారంభించారు. టెన్నీకాయిట్ క్రీడలో 2015 నుంచి ఇప్పటి వరకు వరుసగా పతకాలు సాధించారు. గతేడాది జాతీయ పోటీల్లోరజతాన్ని తీసుకొచ్చారు.

– నీరజ, ట్రాన్స్‌కో ఏఈ, ఐరాల

తల్లిదండ్రుల ప్రోత్సాహం



తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే స్కూల్ అసిస్టెంట్ స్థాయి నుంచి ప్రిన్సిపల్ స్థాయికి ఎదిగాను. మాది తిరుపతి జిల్లా కేంద్రం. తండ్రి మాజీ సైనికుడు విశ్వనాథం, తల్లి విద్యావతి దంపతులకు జన్మించా. నా విద్యాభ్యాసం మొత్తం తిరుపతిలోనే సాగింది. చదువుకునే రోజుల్లోనే హాకీ అంటే చాలా ఇష్టం. నేషనల్ స్థాయి హాకీ క్రీడల్లో పాల్గొంటునే విద్యనభ్యసించాను. 1996 డీఎస్సీలో తొలిసారి స్కూల్ అసిస్టెంట్‌గా ఉపాధ్యాయ వృత్తిలో మొదలుపెట్టాను. 1992లో కలికిరికి చెందిన చిక్కా అశోక్‌ను వివాహం చేసుకున్నా. నా ఉద్యోగ ప్రస్తానం నుంచి తల్లిదండ్రులు, భర్త, కుమారుల ప్రోత్సాహం వల్లే ప్రస్తుతం చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. 61 సంవత్సరాల పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్రలో తొలి మహిళా ప్రిన్సిపల్‌గా పనిచేయడం ఆనందంగా ఉంది.

–డా. పి.జీవనజ్యోతి, ప్రిన్సిపల్, పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు 8వ తేదీన రెండో శనివారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల నిర్వాహకులు రెండో శనివారం సెలవును తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎవరైనా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని డీఈవో వరలక్ష్మి హెచ్చరించారు.

మహిళా స్ఫూర్తిదాయకమైన సినిమాల ప్రదర్శన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

చిత్తూరు అర్బన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మహిళా సాధికారత వారోత్సవం శుక్రవారం కొనసాగింది. చిత్తూరు నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో మహిళా స్ఫూర్తిదాయకమైన సినిమాల ప్రదర్శన చేశారు. పోలీసు అధికారులు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది.

నీటి సమస్య పరిష్కారానికి కంట్రోల్ రూం

చిత్తూరు కార్పొరేషన్ : గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ ఇంచార్జి ఎస్‌ఈ నరేంద్రకుమార్ తెలిపారు. ఎస్‌ఈ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని నీటి సమస్య ఉంటే 08572–233098 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్యలో సంప్రదించాలన్నారు. వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

ఫీజు పోరును జయప్రదం చేయండి

- 12న కలెక్టరేట్ వద్ద ధర్నా
- విజయానందరెడ్డి పిలుపు



నాయకులతో సమావేశమైన విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : చంద్రబాబు పోకడలు పేద విద్యార్థులకు విఘాతం కలిగిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శించారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఫీజు పోరు కార్యక్రమ నిర్వహణపై విద్యార్థి, యువత, ఐటీ విభాగం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వతేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు విజయ డెయిరీ వద్ద వేల మందితో ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు కలిసి కలెక్టరేట్‌కు చేరుకుంటారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా కూటమి సర్కారు వేధిస్తోందన్నారు. 2004లో వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక మంగళం పాడారని ఆరోపించారు. వైఎస్ జగన్ హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ధర్నా కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, నాయకులు మనోజ్‌రెడ్డి, శశిదీప్‌రెడ్డి, స్టాండ్లీ, వినోద్, రూపేష్‌రెడ్డి, సిరాజ్, అజిత్, ప్రవీణ్, రాజేష్, జస్టిన్, రంజిత్, మహేష్, హరీషారెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు బాధ్యతగా నిర్వహించండి



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్

- డెస్క్‌కు ఒక్క విద్యార్థే ఉండాలి
- ఐడెంటిటీ కార్డు లేకుండా పరీక్ష కేంద్రంలో ఉండకూడదు
- చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారుల శిక్షణలో వైఎస్సార్ కడప జిల్లా ఆర్జేడీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆర్జేడీ శామ్యూల్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పది పబ్లిక్ పరీక్షల్లో విధులు నిర్వర్తించే టీచర్లు ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. విద్యార్థులు కింద కూర్చుని పరీక్షలు రాసిన పర్వాలేదని, ఒక డెస్కుకు ఒక విద్యార్థి మాత్రమే పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సస్పెండ్ ఖాయమని హెచ్చరించారు.



శిక్షణ కార్యక్రమానికి హాజరైన డిపార్ట్‌మెంట్ అధికారులు

ఐడెంటిటీ కార్డు తప్పనిసరి....

పరీక్షల విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఐడెంటిటీ కార్డు ధరించాలని ఆర్జేడీ తెలిపారు. పరీక్ష కేంద్రంలో అటెండర్, నాన్‌టీచింగ్ సిబ్బంది ఎవ్వరూ ఉండకూడదన్నారు. పరీక్షల నిర్వహణ లో సిట్టింగ్ స్క్వాడ్ చాలా కీలకమన్నారు. కచ్చితమైన సమయానికి విద్యార్థికి ప్రశ్నపత్రం ఇవ్వాలన్నారు. విధులు నిర్వర్తించే చీఫ్, డిపార్ట్‌మెంట్, ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్‌లు తీసుకువెళ్లకూడదని తెలిపారు.

పరీక్షల నిర్వహణ ఎంతో ముఖ్యం.

పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఎంతో ముఖ్యమని డీఆర్‌వో మోహన్‌కుమార్ అన్నారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియ సంవత్సరం మొత్తం విద్యాశాఖ అధికారులు, డీఈవో కష్టానికి ఫలితమన్నారు. పరీక్షల విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో డీఈవో కార్యాలయం ఏడీ వెంకటేశ్వరరావు, పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు, తిరుపతి డీవైఈవో బాలాజీ, చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్ కార్మికుల సమ్మె

- పుత్తూరులో ఆగిన 1200 మగ్గాలు
- 500 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చని ప్రభుత్వం
- విద్యుత్ చార్జీల పెంపుపై మండిపాటు



పుత్తూరులో పవర్‌లూమ్స్ కార్మికుల ధర్నా

పుత్తూరు : కూటమి ప్రభుత్వంలో పెరిగిన విద్యుత్ చార్జీల నేపథ్యంలో కనీస కూలి ఇవ్వాలంటూ పుత్తూరు పవర్‌లూమ్స్ కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. స్థానిక గేట్‌పుత్తూరులోని వినాయకస్వామి ఆలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు సెంగుంథర్ మక్కల్ నల సంఘం అధ్యక్షుడు ఎం.ఎస్.తిరునావకరసు మాట్లాడుతూ.. పుత్తూరులో 1200 కుటుంబాలకు చెందిన 5 వేల మంది ఈ పవర్‌లూమ్స్‌పై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వీరందరూ నగరికి చెందిన మాస్టర్ వీవర్స్ నుంచి నూలు తెచ్చి దుస్తులుగా తయారు చేసి ఇస్తున్నారని తెలిపారు. అయితే తమకు కనీస కూలి దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పుత్తూరుకు వచ్చిన చంద్రబాబు చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన చంద్రబాబు హామీని తుంగలో తొక్కి, విద్యుత్ చార్జీలను పెంచడంతో పాటు మాజీ సీఎం వైఎస్ జగన్ తగ్గించిన 94 పైసల ట్రూ అప్ చార్జీలను సైతం పెంచి కార్మికుల నడ్డివిరిచారని మండిపడ్డారు. దీంతో తమకు నెలకు రూ.500 నుంచి 1500 వరకు అదనంగా బిల్లులు వస్తున్నాయని, ఈ భారాన్ని తాము మోయలేమని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన విద్యుత్ చార్జీల నేపథ్యంలో గజానికి రూ.12 ఇస్తున్న కూలికి రూ.5 పెంచి ఇవ్వాలని మాస్టర్ వీవర్స్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన మాస్టర్ వీవర్స్ రూ.2 కూలి పెంచడానికి అంగీకరించారని తెలిపారు. అయితే నెలలు గడుస్తున్నా కూలి పెంచి ఇవ్వడం లేదని తెలిపారు. దీంతో విధిలేక సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇకనైనా ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలని, అలాగే న్యాయమైన గిట్టుబాటు కూలి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు.

అవసరానికో రేటు !

- రెవెన్యూలో విచ్చల విడిగా వసూళ్లు
- ధ్రువీకరణ పత్రాల్లో వీఆర్వోల చేతివాటం
- 10 మంది వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు
- సీఎం నియోజకవర్గంలో రెవెన్యూశాఖ పరిస్థితి ఇదీ



కుప్పం : ధ్రువీకరణ పత్రాలు, పాసు పుస్తకాల మార్పులు, చేర్పుల కోసం కుప్పం రెవెన్యూ శాఖలో వసూళ్ల పర్వం విచ్చలవిడిగా సాగుతోంది. వేల రూపాయలు చేతులు మారితే తప్ప బాధితుల ఫిర్యాదులు పరిష్కారం కావడం లేదు. ఈ సంఘటనలపై జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అందిన ఫిర్యాదుల మేరకు 10 మంది వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం కలకలం రేపింది. దీంతో రెవెన్యూ శాఖలో వసూళ్ల పర్వం బట్టబయలైంది.

కుప్పం రెవెన్యూ శాఖలో చేయి తడపందే లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందడం లేదు. రెవెన్యూశాఖలో పెద్ద ఎత్తున పాసు పుస్తకాల చేర్పులు, మార్పులు జరుగుతుంటాయి. వీటి సవరణ కోసం లబ్ధిదారులు నిత్యం వీఆర్వోల వద్దకు వస్తుంటారు. వీఆర్వోలు దీన్ని ఆసరాగా చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. లబ్ధిదారులు అవసరాన్ని బట్టి వసూళ్లల్లో రేట్లు పెంచేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ధ్రువీకరణ పత్రానికి రూ.10 వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 20 నుంచి 50 వేల రూపాయల వరకు వసూళ్ల సాగుతున్నట్లు తెలుస్తోంది. పత్రాలు సమయానికి ఇవ్వక లబ్ధిదారులను చుట్టూ తిప్పించుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

కడా పీడీ మందలించినా మార్పు లేదు..

కడా పీడీ వికాస్ మర్మత్ రెవెన్యూ శాఖలో వసూళ్లపై కొంత మంది సిబ్బందిని మందలించినట్లు సమాచారం. ప్రధానంగా ధ్రువీకరణ పత్రాలు, ఆన్‌లైన్‌లో చేర్పులు, మార్పులపై వేలల్లో డిమాండ్ చేయడంతో పాటు ఇబ్బందులు పెడుతున్నారనే అంశంపై కుప్పం కడా పీడీ రెవెన్యూ సిబ్బందిని తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. కానీ రెవెన్యూ శాఖలో మార్పు రాకపోగా వసూళ్ల పర్వం కొనసాగుతూనే ఉన్నాయి. ఇలా ఉండగా పలార్లపల్లి రెవెన్యూ పరిధిలో ఇంటి పట్టాలు విచ్చలవిడిగా విక్రయాలు చేపడుతున్నట్లు తెలిసింది. సంబంధిత వీఆర్వో పట్టాల కోసం 20 వేల వరకు తీసుకున్నట్లు సమాచారం. కంగుందిలో అయితే అటవీ సరిహద్దు కావడంతో ఇష్టానుసారంగా ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి.

10 మంది వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు

వెండుగంపల్లి, పైపాల్యం, అడవిబూదుగూరు, కొటాలూరు, మల్లానూరు -1, 2, కంగుంది-1, బంగారునత్తం, చెక్కునత్తం, వానగుట్టపల్లి తదితర వీఆర్వోలకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. వసూళ్లపై వివరణ కోరుతూ నాలుగు రోజుల కిందట ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఇంత పెద్ద ఎత్తున వసూళ్ల పర్వం సాగుతుంటే స్థానిక అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

సెలవు రోజుల్లోనూ అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలను సెలవు రోజుల్లో అందజేయవచ్చని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని కేడర్‌ల టీచర్లు ఇటీవల విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా అందజేయాలన్నారు. అభ్యంతరాలకు సంబంధించిన ఆధారాల్లో డీడీవో ధ్రువీకరణ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. చిత్తూరు డీఈవో కార్యాలయంలో ఈనెల 9వ తేదీలోపు అందజేయాలని కోరారు.

అంగన్‌వాడీలకు బెదిరింపులు

– ఐరాలలో ఖాళీ పేపర్ల మీద సంతకాలు

చిత్తూరు కార్పొరేషన్ : అంగన్‌వాడీ సమస్యలపై మార్చి 10న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి అంగన్‌వాడీలు వెళ్లవద్దని అధికారులు హుకుం జారీ చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు నిదర్శనంగా ఐరాల ప్రాజెక్టులో ఖాళీ పేపర్లపై సంతకాలు తీసుకొని బెదిరించిన అధికారుల పై చర్యలు తీసుకోవాలన్నారు. రెండు వారాలకు ముందే ధర్నా కార్యక్రమం పై అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. శాంతియుతంగా ధర్నా చేస్తామని ప్రకటించినప్పటికీ బెదిరింపులకు పాల్పడటం ఏమిటని ప్రశ్నించారు. ఆరోజు సెక్టార్, ప్రాజెక్టు మీటింగులు పెట్టి అంగన్‌వాడీలను నిర్బంధించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు.

క్లుప్తంగా

కాణిపాకం గోసంరక్షణ ట్రస్టుకు రూ. 5 లక్షల విరాళం



నగదు విరాళం చేస్తున్న దాత కుటుంబీకులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు శుక్రవారం ఓ దాత కుటుంబం నగదు విరాళం అందజేసింది. బెంగుళూరుకు చెందిన మురళీకృష్ణ, మహేశ్వరీ అనే దంపతులు రూ.5 లక్షల నగదును ఆలయ అధికారులకు అందించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించిన ఆలయ అధికారులు దాత కుటుంబానికి స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈవో రవీంద్రబాబు తదితరులున్నారు.

10 నుంచి బోయకొండలో వేలం పాట



బోయకొండ గంగమ్మ ఆలయం

చౌడేపల్లె : పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద వివిధ సేవల విక్రయాలపై ఏడాది గడువుకు సీల్డు టెండర్లు, బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ ఏకాంబరం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10,11,12 తేదీల్లో మూడు రోజుల పాటు సీల్డు టెండర్లతో పాటు బహిరంగ వేలం పాటలు జరగనున్నాయి. 10వ తేదీన ఏడు హక్కుల లీజుకిస్తూ ఉదయం 10 గంటలకు వేలం, సీల్డ్ టెండర్లు నిర్వహించనున్నారు. ఈ వేలంలో పాల్గొనేవారు రూ.5 లక్షలు ధరావత్తు చెల్లించాలని కోరారు.

తిరుమల శ్రీవారికి 15 టన్నుల కూరగాయలు



కూరగాయల లారీతో దాతలు, నాయకులు, స్థానికులు

శాంతిపురం : తిరుమల శ్రీవారి ఆలయం, కాణిపాకం వరసిద్ధి వినాయకుడి ఆలయంలో అన్నదానం కోసం దాదాపు 15 టన్నుల కూరగాయలను శుక్రవారం భక్తులు పంపించారు. స్థానిక జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, ఆయన మిత్రులు కలిసి ఈ కూరగాయలను ఏర్పాటు చేశారు. తిరుమల అన్నదానం కోసం 9.5 టన్నులు, కాణిపాకం అన్నదానానికి దాదాపు 5 టన్నులను పంపారు. టీటీడీ , కాణిపాకం ఆలయాల నుంచి వచ్చిన వాహనాలకు పూజలు చేసి కూరగాయలతో నింపి పంపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు హాజరు కాగా స్థానిక సర్పంచ్ మంజునాథరెడ్డి, మునేగౌడు, గిరిధర్‌సాయి, తరుణ్, సుధాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు నిసార్ పాల్గొన్నారు.

అసలే కరోనా కాలం.. బయటకు రావాలంటేనే భయం.. అయినా మొక్కవోని అప్పటి ప్రజాప్రతినిధుల ఆశయం.. వరసిద్ధుడి ఆలయ జీర్ణోద్ధరణే ధ్యేయం.. దాతల ఉదార స్వభావం.. అధికారులు, ఆలయ కార్యవర్గ సహకారం.. వెరసి.. వినాయక స్వామి ఆలయానికి కొత్తరూపం.. వసతుల సాకారం.. ఫలితం..స్వయంభువు చెంత పెరిగిన రద్దీ.. దేవస్థానంలో బ్రహ్మాండంగా ఉందని మురిసిన భక్తగణం. ఇదీ ఇటీవల కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐవీఆర్ఎస్ కాల్స్ సర్వేలో తేలిన అక్షరసత్యం.



అన్నదానంలో భక్తులు



కాణిపాకం మెరిసె.. భక్తజనం మురిసె...

కొత్తరూపం.. బ్రహ్మాండం!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆలయాభివృద్ధికి హారతులు
- జీర్ణోద్ధరణతోపాటు సకల వసతుల కల్పన
- దర్శనం..నిత్యాన్నదానంపై శ్రద్ధ
- అప్పటి ప్రజాప్రతినిధులు, ఆలయ కార్యవర్గం, అధికారులు, దాతల సహకారం
- రాష్ట్రంలో కాణిపాకం దేవస్థానానికి ప్రథమ స్థానం

పెరిగిన భక్తుల తాకిడి

కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం సత్య ప్రమాణాలకు నిలయం. ప్రస్తుతం ఈ ఆలయానికి భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. నేడు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య 10 వేలు దాటుతోంది. శని, ఆది వారాలు, సెలవు దినాల్లో 30 వేల మంది వరకు భక్తులు వస్తున్నారు. బ్రహ్మోత్సవ సమయంలో 80 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారని అంచనా. అయితే ఐదేళ్ల ముందు వరకు ప్రతిరోజు భక్తుల సంఖ్య 5 వేలు దాటేది కాదు. జీర్ణోద్ధరణ తరువాత గత మూడేళ్లుగా స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులే భక్తుల పెరుగుదలకు కారణమని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

కాణిపాకం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాణిపాకం దేవస్థానం అభివృద్ధి పథంలో నడిచింది. జీర్ణోద్ధరణతో సరికొత్తరూపం సంతరించుకుంది. సకల వసతుల కల్పనకు పెద్దపీట పడింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయకార్యవర్గం, దాతలు సంయుక్తంగా దేవస్థానం అభివృద్ధికి హారతులు పట్టారు. ఫలితంగా వరసిద్ధి క్షేత్రం నూతన హంగులతో కొత్త శోభను సంతరించుకుంది. భక్తుల దర్శనంతోపాటు నిత్యాన్నదానంపై శ్రద్ధ చూపారు. దీంతో భక్తుల తాకిడి గణనీయంగా పెరిగింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి.. నిర్ణయాలే రాష్ట్రంలోనే ఆలయానికి ప్రథమ స్థానాన్ని తీసుకొచ్చిందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న పనులివే..

ఆలయ ప్రణాళికల ప్రకారం మరిన్ని అభివృద్ధి పనులకు రూ.18.67కోట్లు కేటాయించారు. దేవస్థానానికి చెందిన వినాయక సదన్ రెండు అంతస్తుల నిర్మాణానికి రూ.12.12 కోట్లు వ్యయం చేస్తున్నారు. అన్నదాన భవన మార్పునకు రూ.3.40 కోట్లు, పైపల్లె వద్ద ఆర్చ్ గేటు నిర్మాణానికి రూ.1.10 కోట్లు, 100 అడుగుల సీసీ రోడ్డు ప్రవేశ ద్వారం నిర్మాణానికి రూ.1.10 కోట్లు, వంద అడుగుల రోడ్డు నిర్మాణం వైపు ప్రహరీ గోడకు రూ.25 లక్షలు, పాటూరు వద్ద ఆర్చి గేట్ నిర్మాణానికి రూ.17.30 లక్షలు, కాణిపాక దేవస్థానం భూమికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.40 లక్షలు, పెయింటింగ్, ఇతరత్రా పనులకు గాను రూ.40లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. స్వామి వారి మహారథం పనులు రూ.15.50 లక్షల వ్యయంతో సాగుతున్నాయి. దీంతో పాటు అప్పట్లోనే రూ. 52 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపారు. షాపింగ్ కాంప్లెక్స్, 40 అడుగుల సీసీ రోడ్డు, పార్కింగ్ స్థలం, కల్యాణ మండపం, కొత్త కోనేరు, వ్యక్తిగత కాటేజీ, అర్చకుల క్వార్టర్స్ నిర్మాణ పనుల కోసం ప్రతిపాదనలు పంపించారు.

దేవస్థానం అభివృద్ధే ధ్యేయంగా..

కరోనా కష్టకాలాన్ని కూడా లెక్కచేయకుండా అప్పటి పాలకులు, అధికారులు దేవస్థానం అభివృద్ధే ధ్యేయంగా పనిచేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దైవ దర్శనాలు కల్పించేలా చూశారు. తొలుత ఆలయ రూపు రేఖలను మార్చారు. ప్రధాన ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయించారు. తర్వాత మరిన్ని అభివృద్ధి పనులకు బీజం పడింది. వసతుల కల్పన, దైవ దర్శనంపై ప్రత్యేక దృష్టి సారించారు. నిత్యాన్నదానంపై పర్యవేక్షణ పెంచారు. అన్నదానంలో కొరవడిన లోపాలను సరిదిద్దారు. భక్తుల మహా ప్రసాదంలో నాణ్యతను పెంచి పర్యవేక్షిస్తూ వచ్చారు. భక్తులు సంతృప్తి చెందేలా చూశారు. తద్వారా కాణిపాకం భక్తుల వృద్ధిలో దిన దినాభివృద్ధి కనిపించింది.

రూ.27.33 కోట్లతో జీర్ణోద్ధరణ

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వహయాంలో రూ.27.33 కోట్లతో పలు అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టారు.
- ఇందులో ఆలయ పునర్నిర్మాణ పనులకు రూ.9.6 కోట్లు వ్యయం చేశారు.
- ప్రధాన ఆలయానికి కట్ స్టోన్ ఫ్లోరింగ్‌కు రూ.77 లక్షలు
- సౌండ్, లైటింగ్ సర్వీసులకు రూ.298.08 లక్షలు
- 100 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డు అనుసంధానానికి, 310 మీటర్ల సీసీరోడ్డుకు రూ.2.85 కోట్లు వెచ్చించారు.
- పడితారం స్టోర్ భవనానికి రూ.4.86 కోట్లు, 100 మీటర్ల బీటీ రోడ్డుకు రూ.1.10 కోట్లు ఖర్చు చేశారు.
- పడితారం సివిల్ స్టోర్ షెడ్ కూల్చివేత, పునర్నిర్మాణ పనులకు రూ.31.50 లక్షలు, చెత్త సంపద కేంద్రం, షెడ్ నిర్మాణానికి రూ.17.50 లక్షలు వ్యయం చేశారు.
- వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్, స్మార్ట్ ఎక్స్‌ప్రెస్ కోసం రూ.18.30 లక్షలతో పనులు పూర్తి చేశారు. ఈఓ కార్యాలయ అభివృద్ధి, మరమ్మతు పనులు, ఫ్లెక్సీ బోర్డు వంటి పనులకు రూ.లక్షలు ఖర్చుచేశారు.



నిర్మాణంలో ఉన్న వినాయక సదన్

రాష్ట్రంలో ప్రథమ స్థానం

గత ప్రభుత్వంలోని అధికారులు, పాలకులు చేసిన కృషి ఫలితమే ఆలయ ప్రథమ స్థానానికి కారణమని భక్తులు వెల్లడిస్తున్నారు. ఇటీవల ప్రస్తుత ప్రభుత్వం ఆలయంలో కల్పిస్తున్న వసతులు, దర్శనం ప్రసాదం తదితర అంశాలపై భక్తుల అభిప్రాయాలను సేకరించింది. ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ఈ వివరాలను సేకరించి.. వారు చెప్పిన అభిప్రాయాల మేరకు మార్కులను ప్రకటించింది. ఇందుకు ప్రధాన కారణం గత ప్రభుత్వం చేసిన కృషి ఫలితమేనని పలువురు భక్తులు చెబుతున్నారు.

హుండీ లెక్కింపులో రూ.1.40 కోట్ల ఆదాయం



కాణిపాకం ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీని శుక్రవారం లెక్కించారు. ఉదయం లెక్కింపు ప్రారంభం కాగా మధ్యాహ్నం వరకు సాగింది. కాగా హుండీ ఆదాయం రూ.1.40 కోట్లు వచ్చాయని ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.10,041, నిత్య అన్నదానం హుండీ ద్వారా రూ.46,285 వచ్చిందన్నారు. యూఎస్ఏవీ 506 డాలర్లు, యూఏఈ 35 దిర్హామ్స్, ఇంగ్లాండ్ 15 పౌండ్స్, కెనడా 100 డాలర్లు, ఆస్ట్రేలియా 100 డాలర్స్, మలేషియా 34 రింగిట్స్ వచ్చాయన్నారు. బంగారం 115 గ్రాములు, వెండి 2.510 కిలోలు వచ్చాయన్నారు.. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రవీంద్రబాబు, క్రిష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.

మొగిలీశ్వర ఆలయానికి రూ. 4.42 లక్షలు

బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామికి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ 4,42,839 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజ తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో 40 రోజులకు సంబంధించి హుండీ, అన్నదాన విరాళాలకు సంబంధించి లెక్కింపు చేపట్టారు. చిత్తూరు దేవ దాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 23 కంపార్టుమెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,548 మంది స్వామివారిని దర్శించుకోగా 21,297 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

పుత్తూరులో ఐపీ బాంబు!

- టీ వ్యాపారి రూ.48.25 లక్షలకు కుచ్చుటోపీ
- లబోదిబోమంటున్న బాధితులు



పుత్తూరు : పట్టణంలో ఓ వ్యక్తి ఐపీ పెట్టిన ఉదంతం శుక్రవారం కలకలం రేపింది. బాధితుల కథనం మేరకు వివరాలు.. స్థానిక గేట్‌పుత్తూరుకు చెందిన జి.ఆర్.భాస్కర్(54) అనే వ్యక్తి ధర్మరాజుల గుడి తేరు వద్ద 15 ఏళ్లుగా టీ షాపు నడుపుతూ వచ్చాడు. షాపునకు వచ్చే పలువురు కస్టమర్ల నుంచి రూ.లక్షల్లో అప్పు చేశాడు. వీరందరికీ కొంత కాలంగా వడ్డీలు చెల్లించకపోవడంతో వారి వద్ద నుంచి అసలు, వడ్డీ ఇచ్చేయాలంటూ ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో టీషాపును మూసివేయడంతో పాటు పుత్తూరు సబ్‌కోర్టులో ఇన్సాల్వెన్సీ పిటీషన్ (ఐపీ) దాఖలు చేశాడు. పిటీషన్‌లో మొత్తం 21 మంది నుంచి రూ.48.25 లక్షలు అప్పులు చేశానని, వ్యాపారంలో నష్టం వచ్చినందున అందరి అప్పులు చెల్లించలేనని పేర్కొన్నాడు. తనకు గేట్‌పుత్తూరులోని ఒత్తవాడవీధిలో సొంత ఇల్లు ఉందని, దీనిని విక్రయించి రుణ దాతలకు చెల్లించాలని కోర్టును అభ్యర్థించాడు. ఈ మేరకు అప్పులిచ్చిన వారందరికీ కోర్టు నుంచి నోటీసులు అందాయి. చిన్నపాటి ఇల్లు అమ్మగా వచ్చేదెంత? అందులో మన వాటాకు వచ్చేదెంత? అంటూ బాధితులు లెక్కలు వేసుకొంటూ లబోదిబోమంటున్నారు. అప్పులు ఇచ్చిన వారిలో ఎక్కువ మంది సామాన్యులు, చిన్నపాటి వ్యాపారులు ఉండడం విశేషం.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి

– బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



చిత్తూరు కార్పొరేషన్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం చిత్తూరు నగరంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. అసెంబ్లీకి రాకుండా.. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను విస్మరించేలా వైఎస్ జగన్ తీరు ఉందని ఆమె దుయ్యబట్టారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పై జగన్ చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, మాజీ ఎంపీ దుర్గ, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితాను సవరించాలి



ఆర్జేడీకి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా టీచర్ల సీనియారిటీ జాబితాలను సవరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. శుక్రవారం జిల్లా పర్యటన వచ్చిన ఆర్జేడీ శామ్యూల్‌కు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్ల సీనియార్టీ జాబితాలో అనేక తప్పిదాలు చోటు చేసుకున్నాయని చెప్పారు. జాబితాలో టీచర్ల పేర్లు గల్లంతు అయ్యాయని తెలిపారు. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం డేటాకు భిన్నంగా వివరాలు ఉండడం ఆవేదన కలిగిస్తోందన్నారు. అభ్యంతరాలు చిత్తూరు కార్యాలయానికి స్వయంగా వచ్చి అందజేయాలని కోరడం అన్యాయమన్నారు. పరీక్షల సమయంలో ఇలాంటి ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. డీఎస్సీ 2008, 2012లో నియమితులైన టీచర్లకు జాయినింగ్ తేదీలు వేర్వేరుగా నమోదయ్యాయని తెలిపారు. అక్టోబర్ 2005లో ఉద్యోగోన్నతి పొంది 03-03-2006 లో విధుల్లో చేరిన వివరాలను సవరించాలన్నారు. చాలా జాబితాలో మెరిట్, ర్యాంక్ ప్రాతిపదికన కాకుండా పుట్టిన తేదీ ప్రకారం జాబితా రూపొందించారని చెప్పారు. డీఈవో కార్యాలయంలో అందుబాటులో ఉన్న డీఎస్సీల వారీగా ర్యాంకులు, రోస్టర్ తదితర వివరాలు వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, నాయకులు రెడ్డప్ప, రెహానా బేగం, ఎస్పీ బాషా, పార్థసారథి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ అంతర్జాతీయ లీగ్ పోటీలకు ఒప్పందం



మాట్లాడుతున్న చెంగల్‌రాయనాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : బాస్కెట్‌బాల్ లీగ్ పోటీల నిర్వహణకు ఇటీవల జాతీయ స్థాయిలో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ట్రెజరర్ చెంగల్‌రాయ నాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్వరలో దేశంలో అంతర్జాతీయ స్థాయిలో బాస్కెట్‌బాల్ లీగ్ పోటీలు అట్టహాసంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అండర్-23 విభాగంలో ఇటీవల విజయవాడలో అంతర్ జిల్లాల ఎంపిక జరిగిందన్నారు. ఉత్తమ క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం చిత్తూరులో బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో అస్సాం రాష్ట్రం గౌహతిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ప్రస్తుతం చిత్తూరులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు పాల్గొంటారన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపే క్రీడాకారులను లీగ్ టోర్నీకి సెలక్షన్ కమిటీ ఎంపిక చేస్తుందన్నారు. 2026 సబ్ జూనియర్స్ బాస్కెట్‌బాల్ టోర్నీ పోటీలు విజయవాడలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఏప్రిల్‌లో సబ్ జూనియర్స్ విభాగంలో చిత్తూరు సమీపంలోని పీఈఎస్ పాఠశాలలో అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

- గ్రామంలోకి వెళ్లకుండా రోడ్డు తవ్వేసిన వైనం
- రాకపోకలు లేక దళితుల అగచాట్లు



రోడ్డును తవ్వేయడంతో ఇంటికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న దళిత విద్యార్థులు

పెనుమూరు(కార్వేటినగరం) : దళితులపై టీడీపీ నేతల అరాచకాలు పెనుమూరు మండలంలో రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. తాటిమాకుల పల్లి పంచాయతీ విడిదిపల్లె దళితవాడ, ఎన్టీఆర్ కాలనీ దళితులు వెళ్లకుండా స్థానిక టీడీపీ నేత రోడ్డును ఆరుచోట్ల జేసీబీతో తవ్వేశారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు 41 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయి.

ఈ గ్రామాలకు 30 ఏళ్లుగా మట్టి రోడ్డు ఉండేది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహా సముద్రం దయాసాగర్‌రెడ్డి చొరవతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 4 లక్షలు వెచ్చించి రోడ్డును బాగు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం నాయకులు దళితులపై కక్ష కట్టి ఉన్న రోడ్డును అడ్డ దిడ్డంగా తవ్వి దారి లేకుండా చేయడంతో దళితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకుంటే కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతామని దళితులు హెచ్చరించారు.



యంత్ర సేవ



- రాయితీతో వ్యవసాయ యంత్ర పరికరాలు
- జిల్లాకు రూ.2.85 కోట్లు కేటాయింపు
- ఆర్‌బీకే ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 26వ తేదీలోపు పూర్తికి కసరత్తు

జిల్లాకు మంజూరైన యూనిట్ల వారీగా వివరాలు

పేరు	యూనిట్లు	రాయితీ (రూ.లక్షల్లో..)
వ్యక్తిగత సాధారణ స్ప్రేయర్లు	250	2.50
పవర్ స్ప్రేయర్లు	575	46.00
ట్రాక్టర్ ఆధారిత స్ప్రేయర్లు	7	2.87
ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్స్	740	205.00
రోటవేటరు	28	12.88
పవర్‌వీడర్లు	17	6.00
బ్రష్ కట్టర్స్	13	4.68
పవర్ టిల్లర్స్	5	5.0

జిల్లాలో సాగు భూమి -	3 లక్షల ఎకరాలు
మొత్తం రైతులు -	2 లక్షల మంది
గరిష్ఠంగా రాయితీ -	50 శాతం
మంజూరు చేసిన నిధులు -	2.85 కోట్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగం పెరిగింది. ఖర్చులు తగ్గించుకుని లాభసాటి వ్యవసాయం కోసం రైతులు ముందడుగు వేస్తున్నారు. కూలీల కొరత వేధిస్తోంది. దీంతో యంత్రాలకే రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు ఇచ్చేందుకు సన్నద్ధమైంది. అయితే దీనిపై ఆర్‌బీకే సిబ్బందికి ఎలాంటి స్పష్టత లేదని చెబుతుండడం గమనార్హం.

2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరుతో ముగియనుంది. రైతులు రాయితీపై పరికరాలు, యంత్రాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెలాఖరులోనే నిధులు ఖర్చు చేయాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియ మొత్తం ఈనెల 26వ తేదీలోపు పూర్తి చేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది.

అర్హులు ఇలా...

- గత అయిదేళ్లు ఎటువంటి వ్యవసాయ యాంత్రీకరణ రాయితీ పొందని వారు.
- అయిదెకరాల్లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, మహిళలు. సన్నకారు రైతులు. ఒక కుటుంబంలో ఒకరికే అవకాశం.
- పట్టాదారు పాసు పుస్తకం కలిగి ఉండి, ఈ-పంట నమోదు చేసుకున్న సాగుదారులు. ఆర్‌వోఎస్ఆర్ భూములు సాగు చేస్తున్న వారూ అర్హులే.
- ఒక రైతుకు ఒక పరికరం మాత్రమే ఇస్తారు.
- రైతు భరోసా కేంద్రాల్లో ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో వెబ్ అప్లికేషన్, మొబైల్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మండల వ్యవసాయాధికారి, డివిజన్ ఏడీఏ ఆమోదం తెలిపితే ఆగ్రోస్ సంస్థ రైతు ఖాతాకు సొమ్ము నేరుగా జమ చేస్తోంది.

యాప్‌లో మార్పులు జరుగుతున్నాయి..



యాప్‌లో దరఖాస్తుల స్వీకరణకు మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. యాప్‌లో ఆప్షన్ అందుబాటులోకి రాగానే దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. వచ్చే వారం నుంచి జరగవచ్చునని అనుకుంటున్నాం. రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, చిత్తూరు